వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శుక్రవారం 06 జనవరి 2023

టీడీపీ అధికారంలోకి వస్తే క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

కడప కార్పొరేషన్, జనవరి 5, ప్రభాతవార్త:

రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక అరాచక పాలన సాగుతోంది. క్రీడలను, క్రీడాకారులను ఏమాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్‌లు అన్నారు. అదే మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించారని గుర్తు చేశారు. జమీల్ మొబైల్ యజమాని షేక్ జమీల్ ఆధ్వర్యంలో గురువారం కడప షాహిదర్బార్ ఫంక్షన్ హాలు నందు జమీల్ ఛాంపియన్ ట్రోఫీని వారు ఆవిష్కరించారు. కేఎస్ఆర్ఎం, కేఆర్ఎం కళాశాలల మైదానాలలో 3 రోజుల పాటు 8 జట్లు మధ్య జరిగే క్రికెట్ పోటీలు జమీల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. జమీల్ మొబైల్ యజమాని షేక్ జమీల్ మాట్లాడుతూ ఉల్లాసంగా ఉత్సాహంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు బాగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖూన్‌కా రిస్టా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, మన్నూర్ అలీఖాన్, కూన్‌కారిస్టా తారీక్ అలీ, క్రికెట్ ప్లేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సొంతనిధులతో అంగన్‌వాడి కేంద్రాలకు కరెంటు

రాజుపాళెం,జనవరి05,ప్రభాతవార్త.

కరెంటు సరఫరా నిలిపి వేసిన మండల పరిదిలోని 28 అంగన్‌వాడి కేంద్రాలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సొంత నిధులతో కరెంటు సరఫరాను పుణరుద్ధరించారు. మండల పరిదిలోని కొర్రపాడు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు దృష్టికి సిడిపిఓ రాజేశ్వరి,సిబ్బంది కరెంటు సమస్యను తీసుకురాగా వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడగా బకాయిలు రూ.2లక్షల 10వేలు ఉన్నందున సరఫరా నిలిపి వేసినట్లు తెలుపగా,చిన్నారులకు కష్టం కదా ఆమొత్తం నేనే సొంతం చెల్లిస్తాను వెంటనే కరెంటు పుణరుద్ధరించాలని తెలుపగా అందుకు కరెంటు అధికారులు అంగీకరించారు. కరెంటు సమస్యకు పరిష్కారం చూపడంతో ఎమ్మెల్యే రాచమల్లుకు అంగన్‌వాడి అధికారులు.సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్య సాధన దిశగా అధికారులు కృషి చేయాలి

వి.సి. ద్వారా కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి

కడప, జనవరి 5 ప్రభాతవార్త :

సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి టాప్ ఫోర్ ప్రయారిటీ సర్వీస్, స్పందన, హౌసింగ్, సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జేసీ సాయికాంత్ వర్మ, డిఆర్ఓ గంగాధర గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.జవహర్ రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్యం, ఆరోగ్యం, సూక్ష్మ నీటిపారుదల, పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, మౌలిక సదుపాయాల కల్పన తదితర కీలక అంశాల్లో సుస్థిరమైన, సమగ్రమైన అభివృద్ధి సాధించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్ సంబంధించి పెండింగ్ లేకుండా నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. అర్హత ఉన్న రైతులందరికీ పీఎం కిసాన్ పథకం వర్తించేందుకు రైతుల నుంచి ఈకేవైసీ తప్పకుండా వేయించాలని సూచించారు. సూక్ష్మ సాగునీటి పథకంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అర్హుల ఎంపిక చేసి పరికరాలను సరఫరా చేసి.. ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా అధిక పోషక విలువలున్న చేపల ఉత్పత్తిని పెంపొందించి.. ఆక్వా హబ్ ల ద్వారా ప్రజలకు చేపలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. డొమెస్టిక్ మార్కెటింగ్ లో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని అధిగమించేందుకు జిల్లాలో ఆక్వా హబ్‌లు, ఫిష్ వెండింగ్, రిటైల్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలన్నీ అర్హులైన వారందరికీ పారదర్శకంగా అందేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు తనిఖీలు చేస్తూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి లేదా క్షేత్ర స్థాయిలో వెళ్ళినప్పుడు ప్రజలతో మాట్లాడి సచివాలయ వ్యవస్థ పటిష్టం కోసం కృషి చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయం వారీగా రోజు ఇచ్చిన టార్గెట్‌ను అధిగమించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వైఎస్ఆర్ చేయూత పథకం కింద జీవనోపాధి కోసం రుణాలు ఇప్పించాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల పనులను ముమ్మరం చేయాలన్నారు. స్టేజ్ కన్వర్షన్ మీద ఫొటోస్ పెట్టాలని సూచించారు. అలాగే జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన పనులు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల్లో మెరుగైన పనితీరు, సమగ్ర పర్యవేక్షణ ఉండాలన్నారు. సుస్థిర ప్రగతి లక్ష్యాల సాధనలో సచివాలయాల కీలక పాత్ర పోషించాలన్నారు. ఈ అంశాలతోపాటు వివిధ ప్రభుత్వ పథకాల అమలు తదితర

అంశాలపై చీఫ్ సెక్రటరీ జిల్లాల కలెక్టర్ లు, జెసిలు, జిల్లా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. విసి అనంతరం జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులతో మాట్లాడుతూ... టాప్ ఫోర్ ప్రయారిటీ సర్వీస్, టాప్ టెన్ ప్రయారిటీ సర్వీస్, ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్స్ సంబంధించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి పోకుండా నాణ్యతతో గడువులోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో.. హౌసింగ్ పిడి కృష్ణయ్య, సీపీవో వెంకట్రావు, జెడ్పి సీఈఓ సుధాకర్ రెడ్డి, డిపిఓ ప్రభాకర్ రెడ్డి, ఎస్డీసి ఎల్. ఏ. శాంతమ్మ, సర్వే ల్యాండ్స్ ఎడి. కనక ప్రసాద రావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారదమ్మ, హార్టికల్చర్ జిల్లా అధికారి మైకేల్ రాజీవ్, ఏపీఎంఐపీ పీడి రవీంద్రారెడ్డి, ఫిషరీస్ డిడి కె.ఎస్.పి. నాగలింగాచారి, ఐసిడిఎస్ పీడి రాణీ తదితర ప్రాధాన్యత రంగ అధికారులు పాల్గొన్నారు.

ఉగాదికి 5లక్షల ఇళ్లు పూర్తి కావాలి

-చీఫ్ సెక్రటరీ డా.జవహార్‌రెడ్డి

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశబెట్టిన నవరత్నాలు, పేదలందరికి పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసి ఉగాదికి 5లక్షల ఇళ్లు పూర్తి కావాలని కలెక్టర్‌లను చీఫ్ సెక్రటరీ డా.జవహార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం జవహార్‌రెడ్డి, రెవెన్యూ, అగ్రికల్చర్, ఆర్టికల్చర్, పశుసంవర్ధక శాఖ, హౌసింగ్ సంబందిత ప్రభుత్వ పథకాల అమలుపై కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రబీసీజన్ ఇ-క్రాప్టికి ప్రభుత్వ నిర్దేశించిన గడువులోగా వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హతలున్న రైతులందరికి పిఎం కిసాన్ పథకం వర్తింప చేసేందుకు రైతుల నుంచి ఇకేవైసి తప్పకుండా వేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడు మేలు చేస్తూ వారి ఆరోగ్యం కోసం అధిక పోషక విలువలు గల చేపలు అందుబాటులోకి తేవాలని మెరగైన ఆరోగ్యాన్ని ప్రజలకు అందించేందుకు ముఖ్యమంత్రి పని చేస్తున్నారన్నారు. స్వయం సహాయ సంఘాల మళిలకు వైఎస్సార్ చేయూత పథకం కింద జీవనోపాది కోసం రుణాలు ఇప్పించాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరయిన పనులను గ్రౌండింగ్ పురోగతి కనిపించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

రవాణా రోడ్లు, భవనములు శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రధ్యుమ్న పిఎస్

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త

జిల్లాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జాతీయరహదారులు పనులకు సంబందించి భూసేకరణ ప్రక్రియను వేగవతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రవాణా రోడ్లు, భవనములు శాఖ ప్రభుత్వ కార్యదర్శి ప్రధ్యుమ్న పిఎస్ కలెక్టర్, జేసిలను ఆదేశించారు. గురువారం జాతీయ రహదారులకు సంబందించి కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ నిధులతో జరుగుతున్న ఎన్‌హెచ్ ఎఐ ఎన్‌హెచ్ పనులకు సంబందించి ఇంకా భూసేకరణ పెండింగ్ ఉన్న చోట ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులు భూసేకరణను సంబందించి ఎన్ని హెక్టార్లు భూ సేకరణ చేశారు. ప్రభుత్వ, ప్రవేట్ భూమి ఎంత సేకరించారు, ఇంకా ఎంత సేకరించాల్సి ఉంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులు కోసం భూసేకరణకు సంబందించి 656.50 హెక్టార్లు భూమి సేకరించాల్సి ఉంది, ఇందులో 350.094 హెక్టార్లు ప్రభుత్వ ప్రవేట్ భూమి హ్యాండోవర్ చేయడం జరిగిందని, మిగిలిన భూమిని భూసేకరణ త్వరగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబందిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

2022లో సైబర్ నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టేలా చేసిన జిల్లా పోలీసులు

- ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా 1554 ఫిర్యాదులు
- మొబైల్ మిస్సింగ్‌పై ప్రత్యేక ట్రాకింగ్ సిస్టం
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప క్రైం, జనవరి 5, ప్రభాతవార్త:

2022వ సంవత్సరంలో తన పర్యవేక్షణలో పోలీసులు సైబర్ నేరగాళ్ల వెన్నులో వణుకు పుట్టేలా ఉక్కు పాదం మోపామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. పలువురు అంతర్ రాష్ట్ర మోసగాళ్లను అరెస్టు చేసి రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేకతను చాటి చెప్పారు. బీమా పేరిట కరోనాతో మరణించిన వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక లబ్ధి అందజేస్తామంటూ ప్రజలను మాయమాటలతో ఏమార్చి రూ.లక్షలు కొల్లగొట్టిన సైబర్ మోసగాళ్లను కటకటాల వెనక్కి నెట్టారు. లోన్ యాప్ మోసాలకు సంబంధించి రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మోసగాళ్లను 14 మందితో పాటు వారికి సహకరించిన మరో 8 మంది స్థానికులను అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లోని రూ.79,13,38,133 నగదును గుర్తించి ఫ్రీజ్ చేసి చర్యలకై ఈడీకి సిఫారసు చేశారు. లోన్ యాప్, ఇన్వెస్టిమెంట్ యాప్, బీమా లాటరీ పేరిట అమాయక ప్రజలను మోసం చేస్తున్న పలువురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి రూ.19,03,196 స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది 2022లో ఐటీ చట్టం కింద 18 కేసులు నమోదు చేసి 58 కేసులను చేధించామన్నారు. దర్యాప్తు తుదిదశలో ఉన్నాయని ఎన్‌సీఆర్పీ పోర్టల్ ద్వారా 1554 ఫిర్యాదులు రాగా 1400 ఫిర్యాదులు పరిష్కరించగా 154 దర్యాప్తులో ఉన్నాయన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

ఇటీవల కాలంలో లోన్ యాప్ బాధితులతో పాటు ఇతర సైబర్ నేరాల బాధితులు ఎక్కువవుతున్నారని అలాంటి వారి కోసం లోన్ యాప్‌ల పైన అవగాహన కల్పించడంతో పాటు ఇలాంటి కేసులను చేధించేందుకు సైబర్ క్రైం విభాగంతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. ఇలాంటి లోన్ యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని పేర్కొన్నారు. ఇలాంటి నేరాల పట్ల సమాచారం తెలిస్తే 1930, డయల్ 100కు సమాచారం తెలపాలన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వారికి తిరిగి అప్పగించేందుకు ప్రత్యేక మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ సిస్టంను ఏర్పాటు చేయడం జరిగిందని దీని ద్వారా బాధితులకు ఫోన్లు త్వరగా లభిస్తున్నాయని ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే జగన్ ప్రభుత్వం లక్ష్యం

ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాష

కడప, జనవరి 5, ప్రభాతవార్త:

దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని దీవించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని 43 వ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ పి. శ్రీలేఖ, ఇంచార్జ్ పి. రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో రవీంద్ర నగర్ సచివాలయం- 6 పరిధిలోని రవీంద్రనగర్‌లోని పాత లా కాలేజ్ వీధి వద్ద గల పలు వీధులలో ని పలు ప్రాంతాలలో పర్యటన. 75వ రోజున "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషాకు పూలమాలలతో సత్కరించి, ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ బాషా రవీంద్ర నగర్ సచివాలయం- 6 పాత లా కాలేజ్ వీధి వద్ద నుండి "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్పొరేటర్ ఏ. శ్రీలేఖ, ఇంచార్జ్ పి. రెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి... స్థానిక కార్పొరేటర్, నాయకులు, అధికారులతో కలిసి.. ఆయా వీధుల్లో నివాసాలన్నింటినీ తిరిగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి.. ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. పథకాల లబ్ధి సమాచారంతో కూడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు.

కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుతున్నవారు ప్రభుత్వ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయగా.. పలువురు తమ సమస్యలను అంజాద్ బాషా దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులకు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు నగర 43 వ డివిజన్ కార్పొరేటర్ పి. శ్రీలేఖ, ఇంచార్జ్ పి. రెడ్డి ప్రసాద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సయ్యద్ ఇబ్రహీం మియా, కార్పొరేటర్లు షేక్ మహమ్మ షఫీ, బాల స్వామి రెడ్డి, మల్లీశ్వరి, వైకాపా నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, ఎన్ఆర్ఐ తోట కృష్ణ, గంగరాజు, జమాల్ వల్లి, తుమ్మలకుంట శివ శంకర్, పసుపులేటి మనోజ్ కుమార్, నాయకురాళ్లు టి.వి. సుబ్బమ్మ, పసుపులేటి విజయ కుమారి,నారాయణమ్మ, మరియమ్మ, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్ లు, డైరెక్టర్లు, ఇతర నగర కార్పొరేటర్లు సభ్యులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

-సభలు ర్యాలీలు నిరసన కార్యక్రమాలకు పోలీస్‌ల అనుమతులు తప్పనిసరి

-పోలీస్ చట్టాలను ప్రతి ఒక్కరు పాటించాల్సిందే -డిఎస్పీ శ్రీధర్

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త

రాయచోటి సబ్‌డివిజన్ పరిధిలో అండర్ సెక్షన్-30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున ఎటువంటి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా క్షమించే ప్రసక్తేలేదని కఠిన చర్యలు తప్పవని అలాగే సభలు ర్యాలీలు నిరసన కార్యక్రమాలకు పోలీస్‌లు అనుమతులు తప్పనిసరిగా తీసుకో వాలని రాయచోటి డిఎస్‌పి శ్రీధర్ తెలిపారు. ఎవర యినా ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొ నబడతాయన్నారు. ఈ యాక్ట్ జనవరి 1 నుంచి 31వరకు అమలులో ఉంటుందన్నారు. నిర్వహించే కార్యక్రమాలు పోలీస్ శాఖకు తెలియజేసిన యెడల వాటిని క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ప్రజలు పోలీస్ శాఖ వారికి సహకరించాలని డిఎస్‌పి శ్రీధర్ కోరారు.

భూసేకరణ పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర రోడ్లు రవాణా భవనముల శాఖ ప్రభుత్వ కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న

కడప, జనవరి 5 ప్రభాతవార్త :

జాతీయ రహదారుల అభివృద్ధి పనుల్లో భాగంగా.. జిల్లాలో చేపడుతున్న భూసేకరణ ప్రక్రియను ప్రభుత్వ లక్ష్యం మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబందిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణపై.. గురువారం రాష్ట్ర రవాణా రోడ్లు, భవనముల శాఖ ప్రభుత్వ కార్యదర్శి పి.ఎస్. ప్రద్యుమ్న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్ లు, జేసిలతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జేసీ సాయికాంత్ వర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రద్యుమ్న మాట్లాడుతూ.. అన్ని జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎన్‌హెచ్ఏఐ, ఎన్‌హెచ్ పనులకు సంబంధించి పెండింగ్ ఉన్న భూ సేకరణ ప్రక్రియను పూర్తి

చేయాలన్నారు. జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి.. భూసేకరణ ప్రక్రియ పురోగతిని ఆయా జిల్లాల కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అందుకు సంబంధించి 3ఏ, 3డీ, 3జి అవార్డు పెండెన్సీ వివరాలను తెలుసుకుని.. అన్ని జిల్లాల్లో ఈ ప్రక్రియలను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులను పూర్తి చేయాలన్నారు.

చీకటి జిఓకు స్వస్తి పలకండి ముఖ్యమంత్రిగారూ!

కళ్లకు గంతలు కట్టుకొని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లకుండా పోలీసుస్టేషన్‌కు చేరిన వైనం

రైల్వేకోడూరు రూరల్, జనవరి 5 ప్రభాతవార్త

రాష్ట్రంలో చీకటి జిఒ-1కు స్వస్తి పలికి ప్రజాస్వామ్యాన్ని కూని చేయవద్దు ముఖ్యమంత్రివర్యా అని అంటూ రైల్వేకోడూరు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర తెలుగుదేశంపార్టీ నాయకులు పంతగాని నరసింహప్రసాద్ వినూత్న నిరసనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డుకు ఇరుపక్కల కళ్లకు గంతలు కట్టుకొని కళ్లులేని కబోదిగా నడుచుకొంటూ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లకుండా నేరుగా స్థానిక పోలీసుస్టేషన్‌కు వెళ్లి గంతలు కట్టుకొని ఎస్ఐగారూ! అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లలేక చివరికి పోలీసుస్టేషన్ వద్దకే చేరుకొని తను రాసిన అర్జీని తమరైన అంబేద్కర్‌కు చేర్చగలరని మనస్ఫూర్తిగా మీకు విజ్ఞప్తి చేస్తున్నానంటూ నరసింహప్రసాద్ ఎస్ఐను వేడుకొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్దకు వచ్చి పూర్తిస్థాయిలో ఆంధ్రప్రదేశ్ నందు ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని ముఖ్యమంత్రి బ్రిటీష్ దొరలవద్ద పనిచేసి వారివద్ద నుండే ప్రతి అంశాన్ని చేతపట్టుకొని అర్ధరాత్రి సమయంలో జిఒ-1 ప్రారంభించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అంబేద్కర్ విగ్రహానికి మొరపెట్టుకొంటున్నానని నరసింహప్రసాద్ అన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశంపార్టీకి అనూహ్య విజయావకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. దేశచరిత్రలో ఇంతటి అరాచకపాలన బ్రిటీష్ పరిపాలన కాలాన్ని ప్రస్తుతం చూస్తున్నామని, 1970 నుండి రోడ్‌షోలు, బహిరంగ సభలు ప్రజాస్వామ్యంలో ఉన్నాయని, ఇప్పుడు వైసిపి ప్రభుత్వం ఈ జిఒలను సృష్టించి తెలుగుదేశంపార్టీని ప్రజాసంఘ పార్టీలను అపహాస్యం చేసేవిధంగా ఇటువంటి కార్యక్రమాలను వైసిపి ఏర్పాటు చేసిందని ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకొని జిఒ-1 రద్దు చేయాలని పంతగాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు బొక్కసం సునీల్, సూర్యప్రకాష్‌నాయుడు, బిసి సంఘం నాయకులు, ఎం.అమర్, దళిత నాయకులు కూని చంద్రయ్య, కస్తూరి దినేష్‌నాయుడు, హరి, టిడిపికి చెందిన యువశ్రేణులు పాల్గొని జై పిఎన్‌పి అంటూ నినాదాలు చేయడంతో పోలీసుస్టేషన్ దద్దరిల్లింది.

అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసనలో పంతగాని నరసింహప్రసాద్

క్రికెట్ స్టేడియం రెండు నెలలో పూర్తి చేయాలి

-నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ గిరీషా పిఎస్

వార్త IVవ పేజీలో

గుట్టుచప్పుడు కాకుండా.. గుట్ట గుటుక్కు..కబ్జా గుట్టు

- వంద ఎకరాలపైనే భూమి ఆక్రమించి సాగు చేస్తున్న ఆక్రమణదారులు - బినామీ పేర్లతో భూ దందాకు పాల్పడుతున్న బడా నాయకులు
- ఆక్రమించిన భూములు పరిశీలించి భూ సర్వే నెంబర్లను గుర్తించి కలెక్టర్‌కు నివేదికలు పంపిస్తాం- రాజంపేట ఆర్డీవో కోదండరామిరెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 5, ప్రభాతవార్త:

భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో ఉన్న ప్రతి పేద వాడికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పేదలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ఉన్న బంజరు భూములను డీకేటి పట్టాల ద్వారా ప్రతి ఒక్కరికి పంపిణీ చేయాలని భూ హక్కు నిబందనలు ఉండేవి. అయితే ఇక్కడ వాటికి విరుద్ధంగా కొందరు బడా బాబులు అందిన కాడికి దోచుకుంటూ గత కొన్ని సంవత్సరాలుగా భూములను ఆక్రమించి చదును చేసుకుంటున్నారని ఆరోపణలు మెండుగా ఉన్నాయి. అయితే వీటి వివరాలు కొందరు పట్టించుకోకుండా యథారాజా, తథా ప్రజా అన్న చందంగా గతంలో ఉన్న రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు ఉండడంతో కబ్జాదారుల ఆట ఆడిందే ఆట పాడిందే పాటగా వీరి భూ ఆక్ర

వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి

జనసేన నాయకులు రాందాస్‌చౌదరి

మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :

రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని జనసేన పార్టీ రాయలసీమ కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాత రాజారెడ్డి పాలన చేస్తున్నారని ఈ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. తుగ్లక్ పాలన చేస్తూ లేనిపోని జీఓలను సృష్టిస్తూ రాష్ట్రంలో అరాచకానికి పాల్పడుతున్నారన్నారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌ను చూస్తే జగన్‌కు భయం చేస్తోందన్నారు. పవన్ వారాది వాహనం ద్వారా త్వరలో ప్రజల్లోకి వస్తానే వైకాపాకు పునాదులు కదులుతాయన్నారు. ఈనెల 12నుంచి పవన్‌కళ్యాన్ యువశక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. యువకల్లో చైతన్యం తెచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జంగాల శివరామ్ పాల్గొన్నారు.

రూ.107.6కోట్లతో చెరువుల నిర్మాణానికి ప్రతిపాదనలు

మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :

తంబళ్ళపల్లె నియోజకవర్గంలో రూ.107.6కోట్లతో చెరువుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పెద్దమండ్యం మండలం ఆకుమానుగుట్ట వద్ద రూ.11.30కోట్లతో, కుషావతి నది సమీపంలో గజ్జంవారిపల్లె వద్ద రూ.6.35కోట్లతో తంబళ్ళపల్లె మండలంలోని చింతల రేవుపల్లె వద్ద రూ.55కోట్లతో, ఆకుమానుగుట్ట వద్ద కొత్త చెరువు నిర్మాణం కోసం రూ.6.30కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. మదనపల్లెపట్టణంలోని బుగ్గవంక, బాహుదా, ముగ్గురాళ్ళ వంకలపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.83కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

చంద్రబాబును కలసిన ఎస్ఎ.మస్తాన్

మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం కుప్పంలో రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్ఎ. మస్తాన్ కలిశారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ క్యాలెండర్‌ను చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ 2024 ఎన్నికల్లో మదనపల్లెలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయాలని సూచించినట్లు తెలి పారు. మైనార్టీలు అందరూ ఐక్యంగా ఉండి టిడిపి బలోపేతానికి కృషి చేయాలని చెప్పినట్లు తెలిపారు. కుప్పంలో చంద్రబాబు నాయుడు నిర్వహించిన రెండురోజుల పర్యటనలో మదనపల్లె మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పఠాన్‌ఖాదర్ ఖాన్, ఎస్ఎం.రఫి పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

మదనపల్లెక్రైం, జనవరి 5 ప్రభాతవార్త :

పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నరసింహా సర్వేపల్లి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేసి పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను పెంచాలని, ఎస్సి, ఎస్టి, బిసి సంక్షేమ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని, విద్యార్థులకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థులకు మంచి నీరు, టాయిలెట్స్, నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గణేష్, మదనపల్లె ఎస్ఎఫ్ఐ నాయకులు జయబాబు, నాని పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన తనిఖీలు

మదనపల్లెక్రైం, జనవరి 5 ప్రభాతవార్త:

మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర వైద్య ఆరోగ్యశాఖా బృందం సభ్యులు తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం బృందం సభ్యులు ఆసుపత్రిలో పర్యటించి అన్ని విభాగాలను పరిశీలించారు. ఈ నివేధికలను తయారు చేశారు. గురువారం కూడా పర్యటించి నివేధికలు తయారు చేశారు. శుక్రవారం కూడా నిర్వహిస్తారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆంజనేయులు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు చేసి నివేదికలను తయారు చేశారు. వీటిని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖకు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ దివాకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును కలసిన హనీఫ్

కలికిరి, జనవరి 5 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం కుప్పంలో రాష్ట్ర టిడిపి మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి ఎంఐ హనీఫ్ కలిశారు. ఈసందర్భంగా తనను రాష్ట్ర టిడిపి మైనార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మాజీ సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం టిడిపి మైనార్టీ క్యాలెండర్‌ను మాజీ సిఎంచే ఆవిష్కరింప చేశారు. ఈ సందర్భంగా మాజీ సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని ఎంఐ హనీఫ్‌ను ఆదేశించారు. మాజీ సిఎంను కలిసిన వారిలో మండల టిడిపి మైనార్టీ నాయకులు జావిద్, ఖాదర్‌వల్లీ, జాకీర్, సుబహాన్, అప్రీద్, ముభాకర్‌లు కలరు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి : డిఎల్‌డిఓ

కలికిరి, జనవరి 5 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందే విధంగా చూడాల్సిన బాధ్యత పంచాయితీ కార్యదర్శి, సచివాలయాలపై ఉందని మదనపల్లె డివిజన్ డిఎల్‌డిఓ లక్ష్మీపతి అన్నారు. గురువారం మండలం లోని మేడికుర్తి సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. అదే సచివాలయాకు వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు విని పరిష్కరించాలని డిఎల్ డిఓ ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సచివాలయ సిబ్బందిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓఆర్‌డి అబ్దుల్ కలాంఆజాద్, పంచాయితీ కార్యదర్శి రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిఓ-1పై తెలుగుతమ్ముళ్ళ ఆగ్రహం

కలికిరి, జనవరి 5 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం జిఓనెంబర్ 1 తెచ్చి కుప్పంలో మాజీ సిఎం చంద్రబాబు నాయుడును పోలీసులు అడ్డుకోవడంపై గురువారం కలికిరిలో తెలుగుతమ్ముళ్ళు భగ్గుమన్నారు. మండలంలోని టిడిపి అధ్యక్షులు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బ్యాడ్జులు ధరించి ప్రభుత్వం తీరుకు నిరసన చేపట్టారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఓ నెంబర్ 1 కాఫీలను కాల్చి బూడిద చేశారు. కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ టిడిపి కార్యనిర్వాహణ కార్యదర్శి అవినాష్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కంభం వెంకట రమణారెడ్డి, రెడ్డప్పరెడ్డి, మాజీ జడ్పిటిసి మాలతి, సీనియర్ నాయకులు వాటర్ షెడ్ రవి, ముస్తఫా హాజరత్, అక్బర్, మునాఫ్, రాంబాబు పాల్గొన్నారు.

అర్హులందరికి ఫించన్లు : ఎమ్మెల్యే

నిమ్మనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఫించన్లు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా మండల కేంద్రమైన నిమ్మనపల్లె సింగల్‌విండో కార్యా లయం ఆవరణంలో గురువారం వైఎస్ఆర్ ఫించన్ కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొదట జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం పలుసంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి నరసింహులు, మండల కన్వీనర్ రమణా రెడ్డి, సింగల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మెన్ శ్రీని వాసులు రెడ్డి, నాయకులు బాబురెడ్డి, దొరారెడ్డి, నరేంద్ర, నవీన్, మౌళా, అస్లాం, సర్పంచ్‌లు, ఎంపిసిటిసభ్యులు, గ్రామ కార్యదర్శులు, ఎంపిడిఓలు లీలామాదవి, తహశీల్దార్ మంజుల పాల్గొన్నారు.

పెరటి కోళ్ళ పెంపకంతో అధికా లాభాలు : ఏపిఎం

రామసముద్రం, జనవరి 5 ప్రభాతవార్త:

పెరటి కోళ్ళను పెంపకంతో అనేక లాభాలు ఉన్నాయని ఏపిఎం సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని కేసి పల్లె, రామసముద్రం, చెంబకూరుల్లో గురువారం రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కింద పెరటి పంపుకోళ్ళను వెలుగు మహిళా గ్రూపులకు అందించడం జరిగింది. పెంపుడు కోళ్ళతో అనేక లాభాలు పొందవచ్చునని కోళ్ళ వల్ల లభించే కోడిగ్రుడ్లు పిల్లలకు మంచి పౌష్టికాహారమన్నారు. కోళ్లతో వచ్చే నాణ్యమైన మాంసం కూడా పౌష్టికాహారమే అన్నారు. ఏపి ప్రభుత్వం సంఘమిత్రాలచే మహిళా సంఘాలకు అందజేసే ప్రక్రియ విజయవంతం చేయాలని ఏపిఎం కోరారు. కార్యక్రమంలో మూగవాడి సర్పంచ్, సంఘ అధ్యక్షురాలు టి.రత్నమ్మ, కేసిపల్లె పంచాయతీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, సంఘమిత్రాలు, మహిళలు పాల్గొన్నారు.

సభలకు షరతులు పెట్టడం సమంజసం కాదు

కేవి.పల్లె, జనవరి 5 ప్రభాతవార్తః

రాష్ట్రంలో అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీలవారు నిర్వహించే సభలకు జీవోలు, షరతులు పెట్టడం సమంజసం కాదని కేవి.పల్లె మండల తెదేపా అధ్యక్షురాలు గీతమ్మ అన్నారు. గురువారం కేవి.పల్లె పార్టీ కార్యాలయం వద్ద మండల స్థాయి నాయకులతో నల్లబ్యాడ్జీలు తో నిరసన చేపట్టారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎం.జీవి.రమణ, రాజశేఖర్‌నాయుడు, రవిచంద్రారెడ్డి, యర్రమరెడ్డి, ద్వారకనాథనాయుడు,ధనుంజయ, వీర రాఘవులు నాయుడు తెదేపా నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరు సమిష్టిగా పనిచేయాలి

పీలేరు, జనవరి 5 ప్రభాతవార్తః

అందరు సమిష్టిగా కలిసి పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే జీవి.శ్రీనాథరెడ్డి అన్నారు. గురువారం 4,5, సచివాలయాల పరిధిలో స్థానిక బోదేషావలి దర్గాలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. పూర్తైన ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందన్నారు. పట్టణంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరికి అందించాలన్నారు. కార్య క్రమంలో ఎంపిపి సతీష్‌రెడ్డి, జడ్పీటీసీ ఏటి.రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచిలు హబీబ్‌బాషా, మండల కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి , కోఆప్షన్ సభ్యులు షామియానా షఫీ, వైస్ ఎంపీపీలు ఎన్‌వి.చలపతి, హరిత, ఎంపీటీసీలు జవహర్, ఇబ్రహీం, నాయకులు శ్రీనాథరెడ్డి, హుమయూన్, కష్ణారెడ్డి, జయపాల్‌రెడ్డి, పెద్దోడు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికం : సీపీఐ

పీలేరు, జనవరి 5 ప్రభాతవార్తః

నియోజకవర్గ, ఎమ్మెల్యే, ప్రతిపక్షనాయకులు మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటనను కుప్పంలో అడ్డుకోవడాన్ని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ గురువారం తీవ్రంగా ఖండించారు. ఈసందర్భంగా ఓ ప్రకటన విడుదల చేశారు. రోడ్లు ప్రదర్శనలను నిషేదించే జీవోను అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకుడిని సొంత నియోజకవర్గంలో తిరగకుండా అడ్డుకోవడం గంటపైగా రోడ్డుపైనే నిలబెట్టడం అప్రజాస్వామ్యం అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ చర్యను ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. ఒకవైపు సీఎం సహా మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు యధేచ్ఛగా తిరుగుతూ ప్రతిపక్ష పార్టీలు వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలపై నిషేదం విధించడం రాజ్యాంగ వ్యతిరేకం, చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. తక్షణం ఆంక్షలను ఎత్తివేసి శాంతి యుతంగా సామరస్య పూర్వకంగా సభలు సమావేశాలు జరిగేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతికి నివాళి

వాల్మీకిపురం, జనవరి 5 ప్రభాతవార్తః

వాల్మీకిపురం మండలంలోని టి.సాకి రేవుపల్లె సర్పంచి శ్రీకాంత్‌రెడ్డి తండ్రి వెంకట రామిరెడ్డి(72) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈవిషయం తెలుసు కున్న ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి టి.సాకిరేవుపల్లికి చేరుకుని మతదేహానిక పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యాధర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి హరి, ఈశ్వర, వరుణ్, మల్లికార్జునరెడ్డి, వేణు గోపాల్‌రెడ్డి శీను పాల్గొన్నారు.

గ్రామంలో పింఛన్లు పండుగ

వాల్మీకిపురం, జనవరి 5 ప్రభాతవార్తః

ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా అర్హులైన ప్రతి అవ్వాతాతకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజికి భద్రత కల్పిస్తున్నారని మండలంలోని జారావారి పల్లె సర్పంచి మునిభాస్కర్ అన్నారు. గురువారం జారావారిపల్లె పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచుతూ పోతున్నారని ప్రస్తుతం రూ.2750 పెంచారన్నారు. అవ్వాతాతకు ఏకష్టం వచ్చిన నేను ఉంటానంటూసీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండ గా ఉంటానన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భారతమ్మ, నాయ కులు గురుమూర్తి, రామారావు, రాజ, చంద్ర, సచివాలయ సిబ ంది పాల్గొన్నారు.

వేటగాళ్ల దాడిలో నెమలి మృతి

వాల్మీకిపురం, జనవరి 5 ప్రభాతవార్తః

వేటగాళ్ల దాడిలో ఓనెమలి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసు కుంది. గొర్రెల కాపరుల సమాచారం మేరకు పట్టణ సమీపంలోని గొల్లపల్లె రోడ్డులో నెమలి సంచరిస్తుంటాయి. గురువారం ఎవరో గుర్తు తెలియని వేటగాళ్లు నెమలిపై దాడిచేయడంతో నెమలి మృతి చెందింది. ఎవరో వస్తున్నట్లు అలజడి కావడం తో దుండగులు పరారైనట్లు గొర్రెల కాపరులు తెలుపుతున్నారు. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైనారిటీ అభివద్ధి జగన్‌తోనే సాధ్యం

వాల్మీకిపురం, జనవరి 5 ప్రభాతవార్తః

స్తానిక కొత్త ఇందిరమ్మ కాలనీలో మసీదు నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి నిధులు నుంచి రూ.5 లక్షలు నిధులు మంజూరైనట్లు స్థానిక ఉప సర్పంచి కేశవరెడ్డి తెలిపారు. గురువారం నిధులు మంజూరైన పత్రాన్ని వైకాపా సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో మంజూరు పత్రాన్ని ముస్లీం మతపెద్దలకు అందించారు. ఈసందర్భంగా ఉప సర్పంచి మాట్లాడుతూ ఎమ్మెల్యే చింతల రామచం ద్రారెడ్డి రాష్ట్ర ఖనిజాభివద్ధి శాఖ డైరెక్టర్ హరీష్‌రెడ్డి కషితో నిధులు మంజూరైయ్యాయన్నారు. కార్య క్రమంలో ముస్లీం నాయకులు కువైట్ ఇబ్రహీం, సాదిక్, షాహిద్, బాబు, సయ్యద్‌బాషా, అన్వర్, గౌస్, బాబు, అలీమ్, మహమ్మద్‌ఆలీ, హర్షద్ సులేమాన్ పాల్గొన్నారు.

జీవో నెంబరు 1ని వెంటనే రద్దుచేయాలి

వాల్మీకిపురం, జనవరి 5 ప్రభాతవార్తః

ప్రతి పక్షాల స్వేచ్ఛను అణచివేసే ప్రక్రియలో భాగంగా వైకాపా ప్రభుత్వం జీవో నెంబరు 1 లాంటి చీకటి జీవోలను తీసుకొచ్చిందని తక్షణమే దీన్ని రద్దు చేయాలని తెదేపా నాయకులు డిమాండు చేశారు. గురువారం స్థానిక గాంధీ సర్కిల్‌లోని అనంతపురం- తిరుపతి జాతీయ రహదారిపై జీవోకు వ్యతిరేకంగా తెదేపా నాయకులు నిరసనలు తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వారు ప్రభుత్వం తీరు మారేలా చూడాలని అంబేద్కర్ వినతిపత్రం సమర్పించారు. జీవోను రద్దు చేసేంతవరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు రమణ, రాజేంద్రాచారి, కోసూరి చంద్రమౌళి, రమణ, డిష్ బ్రదర్స్ జాఫర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు సకాలంలో చెల్లించాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 5, ప్రభాతవార్త:

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఆవాస్ జిల్లా కార్యదర్శి నర్సింలు పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలో ఆవాస్ ఉపాధ్యాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు డీ ఫాల్టర్లగా మారి సిబిల్ స్కోర్ తగ్గుతుందని భవిష్యత్తులో బ్యాంకులు కూడా ఉద్యోగస్తులకు రుణాలివ్వని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అదే విధంగా సంక్రాంతి సెలవులు జనవరి 11 నుంచి 16 వరకు ఇచ్చారని 17వ తేదీ వెంటనే పాఠశాలకు విద్యార్థులు ఉపాధ్యాయులు రావాలంటే ఇబ్బంది అవుతుందని తెలిపారు. 18 వరకు పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సబ్యులు నరసింహులు, జిల్లా మీడియా ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు నాగులయ్య, కోశాధికారి మల్లయ్య, మండల ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యువత చదువుకొని దేశానికి ఆదర్శంగా నిలవండి

తంబళ్లపల్లె, జనవరి 5, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె నియోజకవర్గంలోని యువత చదువుకొని తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని అభివృద్ధి చెంది దేశానికి ఆదర్శంగా నిలవాలని చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గుండ్లపల్లి పంచాయతీలో ప్రతిపల్లెతో పాటు ప్రతి గడపకు వెళ్లి ఆయన ఆత్మీయంగా పలకరించారు. మీకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట రామస్వామి రెడ్డి, రాఘవరెడ్డి, శంకర్‌రెడ్డి, బడుగు, బలహీన వర్గాల ప్రజలు, రైతులు, కూలీలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం సంరక్షణ కోసం మా కృషి

తంబళ్లపల్లె, జనవరి 5, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలంలో మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తున్నట్లు డా.మునికుమార్ తెలిపారు. గురువారం గుండ్లపల్లె పంచాయతీలో ప్రతి ఇంటికి డాక్టర్‌తో పాటు వైద్య సిబ్బంది తరలివెళ్లి వైద్య సేవలు అందించడం పరిపాటి అని కోసువారిపల్లె డాక్టర్ నిరంజన్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఎంపీ హెచ్‌ఈవో వెంకటరమణ గ్రామంలో ప్రతి ఇంటికి వైద్య సేవలు అందించి ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వేడి నీరు తాగి వడపోసి తాగాలని వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్య శిబిరంలో 104 వైద్యసిబ్బందితో పాటు మేల్ వర్కర్ కృష్ణ నాయక్, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సగర కులస్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రొద్దుటూరు క్రైం, జనవరి 5, ప్రభాతవార్త:

నగర కులస్థుల అందరూ అన్ని రంగాల్లో ముందుకు రావాలని నగర సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళీ పిలుపునిచ్చారు. కడప జిల్లా నగర సంఘం కార్యాలయంలో జిల్లా క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో సగర కులస్థులకు అన్ని విజయాలు సిద్ధించాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పంగల పెద్ద చంద్రాయుడు, బెడుదురు రామకృష్ణ, జగతి వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, వేమన, సుబ్బరాయుడు, కార్యదర్శులు రామచంద్రా, రాజోలు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన అడ్డుకోవడం అన్యాయం

జమ్మలమడుగు, జనవరి 5, ప్రభాతవార్త:

కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకున్నందుకు నిరసనగా గురువారం జమ్మలమడుగు తెదేపా ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామి రెడ్డి అంబేద్కర్ విగ్రహం వద్ద ననిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో అరాచక పాలన సాగుతోందని చంద్రబాబు నాయుడు పర్యటనను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, దేవగుడి అభిమానులు పాల్గొన్నారు.

బాలాజీ హైస్కూలుకు ఎక్స్‌లెన్స్ అవార్డు

జమ్మలమడుగు, జనవరి 5, ప్రభాతవార్త:

బాలాజీ హైస్కూల్ దేశ స్థాయిలో వరసగా 2వ సారి స్కూల్ ఎక్స్ లెన్స్ అవార్డు గ్రహీతగా నిలవడం ఆనందంగా ఉందని బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక బాలాజీ హైస్కూల్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీ హైదరాబాదులోని హైటెక్ సెంటర్ ఫంక్షన్ హాలులో బ్రెయిన్ ఫీడ్ సంస్థ వారు ఉత్తమ పాఠశాలలను ఎంపిక చేసి ఆ యాజ మాన్యాలకు అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు స్ఫూర్తితో ప్రతి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు స్ఫూర్తిని నింపడంతో పాటు సంతోషంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు సూర్య మిత్ర, ఏవో ప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు వరి నాట్లపై సూచనలు

బద్వేలు రూరల్, జనవరి 05 ప్రభాతవార్త :

మండల పరిధిలోని తొట్టిగారిపల్లె, పలు గ్రామాలలో వరి నాట్లపై రైతులకు సహాయ వ్యవసాయ సంచాలకులు మర్రిపాటి నాగరాజ సూచనలు అందజేసి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారు కొనలను త్రుంచి నాటడం వలన తెగుళ్ళను నివారించ వచ్చని, కాలి బాటలను తీసుకోవడం వలన దోమ పోటు నివారించవచ్చని సూచించారు. కొన్ని రాజీలేని సూత్రాలను పాటిం చడం వల్ల పెట్టుబడికి మించి ఆదాయం పొందవచ్చని పలు రకాల సలహాలు, సూచనలు అందించారు. ఈ-పంట నమోదును రైతుల దగ్గర ఉండి చేయిం చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య, గ్రామ వ్యవసాయ సంచాలకులు పవన్, సందీప్, సాయి కిరణ్ రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పురుషుల కళాశాలలో జాతీయ పక్షి దినోత్సవం

కడప, జనవరి 5, ప్రభాతవార్త:

ప్రభుత్వ పురుషుల కళాశాలలోని జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో జాతీయ పక్షి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్, జనవరి 5, ప్రభాతవార్త:

రాయలసీమ విద్యార్థి యువజన సంఘం (ఆర్ఎస్వైఎఫ్) మూడో జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కడప నగరంలోని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శంకర్ మాట్లాడుతూ ఈనెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా మహాసభలను నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు, యువకులు, నిరుద్యో గులు పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ మహాసభలలో గత కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్తు కార్యా చరణను రూపొందించడం జరుగుతుంది. ఎన్నికల హామీలు, ఉక్కు పరిశ్రమ నిర్మాణం, నూతన జాబ్‌క్యాలెండర్, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మొటిక్ ఛార్జీలు ధరలకనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలి. జీవో నెంబర్ 77 రద్దు చేయా లన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు శివ, సోయల్, నగర సహా య కార్యదర్శి నాయక్, నగర ఉపాధ్యక్షు డు కార్తీక్ పాల్గొన్నారు.

డిజిటల్ విద్యా విధానానికి అధిక ప్రాముఖ్యత

కడప ఎడ్యుకేషన్, జనవరి 5, ప్రభాతవార్త:

మారుతున్న పరిస్థితులకు, ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా విద్యా విధా నాన్ని అమలు పరచాలని సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డా.అంబవరం ప్రభా కర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి చెప్పలి దేవరాజులు సూచించారు. గురువారం కడప నగరంలోని విద్యామందిర్ పాఠశాల లో వైఎస్ఆర్ జిల్లాలో సీబీ ఎస్ఈకి ఎంపిక చేయబడిన 31 పాఠశాలలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి విడతలో జిల్లాకు 31 పాఠశాలలను సీబీఎస్ఈకి ఎంపిక చేయబడ్డాయని పేర్కొన్నారు.సీబీఎస్ఈ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం ఎస్సీఈఆర్టీ ద్వారా రాబడిన రీసోర్స్ పర్సన్ సాయికుమారి రాజినీ చౌదరి, జిల్లా రీసోర్స్ పర్సన్‌లు అపర్ణరెడ్డి, జ్యోతిలు, సీబీ ఎస్ఈ ప్రాము ఖ్యత అవసరాలు చేయాల్సిన పనులను వివరించారు. కార్య క్రమంలో కడప డివిజన్ ఉపవిద్యా శాఖ అధికారి రాజగోపాల్ రెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రామాంజనేయులురెడ్డి, గర్ల్స్ చైల్డ్ డెవలప్ మెంట్ ఆఫసర్ ధనలక్ష్మి, కోర్స్ కోఆర్డినేటర్ ప్రమీల సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో చంద్రబాబుతో భేటీ అయిన పుత్తా

కమలాపురం, జనవరి 5, ప్రభాతవార్త:

తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసిం హారెడ్డి కుప్పం పర్యటనలో ఉన్న తెదేపా అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడులు కలిసి చాలాసేపు ఏకాంతం గా జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ప్రధానంగా కమలా పురం నియోజకవర్గంలో తెదేపాకు అత్యధికమైన ఓటు బ్యాంకు ఉన్నదని, ప్రస్తుతం టీడీపీ చేస్తున్న ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం మంచి స్పందన ఉన్న దని ప్రజల్లోకి వెళ్లి వైసీపీ దౌర్జన్యాలు, అక్రమాలు, అవినీతి, ఇసుక మాఫియా, భూకబ్జాలు, ధరల పెంపు అంశాలపై ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగిపో తున్న విషయాలపై సుధీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో పోలీసులను అడ్డం పెట్టు కొని చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని జగన్ నియంత పాలన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏ నియోజక వర్గంలో అయినా ఎవరిని కదిలించినా టీడీపీకి మంచి ఆధరణ కనపడుతున్నదని తెలిపారు.

ఆర్‌బీకేల సమీక్ష సమావేశం

కమలాపురం, జనవరి 5, ప్రభాతవార్త:

కమలాపురం వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబం ధించిన ఆర్‌బీకే సిబ్బందికి సమీక్ష సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఆర్‌బీకే సిబ్బంది వైఎస్ఆర్ యాప్ పని తీరును మెరుగు పరుచుకోవాలని తెలిపారు. పంటకోత ప్రయోగాలకు సంబంధించి ఫామ్-1 కూడా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం మండల వ్యవసాయ అధికారి ఎం.సరస్వతి, వి.ఎన్.పల్లి మండల వ్యవసాయాది కారి శ్యాంబాబు, హెచ్‌యూబీ ఏఓ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం

దువ్వూరు, జనవరి 5, ప్రభాతవార్త:

ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వికలాంగులకు పింఛన్లు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోందని నీలాపురం గ్రామ సర్పంచ్ రామయ్య, మూడిండ్లపల్లె గ్రామ సర్పంచ్ మంచాల రాజగోపాల్‌రెడ్డిలు అన్నారు. గురువారం నీలాపురం గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లు వీరు పంపిణీ చేశారు. కొత్తగా మంజూరైన వారికి రూ.2750 వాలంటీర్లతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ ఇచ్చిన మాట మేరకు పింఛన్లు పెంచారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

మదనపల్లె, జనవరి 5 ప్రభాతవార్త :

అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథ కాలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని 27వ వార్డు జ్యుడిషియల్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వపథకాల బుక్‌లెట్‌ను గడప గడపకు తీసుకెళ్ళి లబ్ది దారులకు అవగాహన కల్పించారు. వార్డులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కరీముల్లా, ఎస్వి.రమణ, ఆర్‌వి.శివారెడ్డి, మేస్త్రీ శ్రీనివాసులు, వసీం, శారదారెడ్డి, మెట్రోబాబ్‌జాన్, ఇర్ఫాన్‌ఖాన్, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగనాథస్వామి పేరునే కూరగాయల మార్కెట్‌కు కొనసాగించాలని వినతి

పులివెందుల, జనవరి 5, ప్రభాతవార్త :

పులివెందులలో రంగనాథస్వామి పేరునే కూరగాయల మార్కెట్‌కు కొనసా గించాలని భాజపా నాయకులు కోరారు. పులివెందుల మున్సిపల్ కమీషనరు నర సింహారెడ్డిని గురువారం భాజపా నాయ కులు శశిభూషణ్‌రెడ్డి, ఎ.చంద్రమోహన్‌రెడ్డి, డి.రామచంద్రారెడ్డి, భానుప్రకాష్, శ్రీరాములు, శ్రీనివాసరెడ్డి, పాండు, నాగరాజుయాదవ్ కలిశారు. గతంలో దివం గత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్వహస్తాలతో రంగనాథస్వామి కూరగాయల మార్కెట్ ను ప్రారంభిస్తే, నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా పున:ప్రారంభించడం హిందువుల మనోభావా లు దెబ్బతీసే విధంగా ఉందన్నారు. పులివెందుల రింగ్‌రోడ్డు కూడళ్లలో దేశం కోసం ప్రాణాలర్పించిన దేశనాయకుల విగ్రహాలు పెట్టకుండా వైఎస్ఆర్ విగ్రహాలు పెట్టినా పులివెందుల ప్రజలు పట్టించుకోలేదని, కానీ రంగనాథస్వామి పేరుతో ఉన్న కూరగాయల మార్కెట్ పేరు మార్చడంపై హిందువులు మనోభావాలు దెబ్బతిని ఆగ్రహంతో ఉన్నారన్నారు.

ముఖ్యమంత్రి నియంతృత్వ పోకడలు మానుకోవాలి

వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలు, నియంతృత్వ పోకడలు మాను కోవా లని టీడీపీ నాయకులు మహమ్మద్ షబ్బీర్, రామమునిరెడ్డిలు ధ్వజమెత్తారు. గురువారం వేంపల్లెలో ఆ పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరూ మంచి పనులకు శ్రీకారం చుడతారని కానీ ముఖ్య మంత్రి మాత్రం ప్రజాకంటక జీవో విధానం అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. వైకాపా నిర్వహించే సభలకు జనం రాకపోవడంతో సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని పరోక్షంగా ప్రలోభాలకు గురి చేసి జనాలను కూడగడుతున్నట్లు ఆరోపించారు. కుప్పం నియోజకవర్గంలో సభలకు, ర్యాలీలకు అనుమతించకపోవడం దారుణమన్నారు. పోలీసులను, అధికారాన్ని అడ్డం పెట్టు కుని తెదేపా కార్యకర్తలు, అభిమానులపై లాఠీఛార్జి చేయించడం హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నా థరెడ్డి, నాయకులు ఆర్.వి. రమేష్, పూల బక్షు, రవికుమార్, మహమ్మద్, ఐటీడీపీ ఇన్‌ఛార్జి గోటూరు నాగభూషణం .

మొక్కలతో ఆహ్లాదకర వాతావరణం

వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :

మొక్కలు నాటి సంరక్షిస్తేనే ఆహ్లాద కర వాతావరణం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సి.యోగాంజ నేయులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పాములూరు జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఓబుళరెడ్డి ఆధ్వర్యంలో శుభ్రత పాటించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివరామ్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేసి మొక్కలు నాటిన వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఆయన అభినందించారు. కార్య క్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంపు

ముద్దనూరు జనవరి 6, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చి న మాట ప్రకారమే, పెన్షన్ మొత్తాన్ని పెంచారని, ముఖ్యమంత్రి జగన్ ను ఎన్నడును మరువ వద్దని, ముద్దనూరు మాజీ మండలాధ్యక్షుడు కెవి ముని రాజారెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరు ఎంపిడిఓ కార్యాలయం లో వైఎస్ ఆర్ పెన్షన్ కానుక పథకం కింద కొత్తగా మంజూరైన 200 మంది కి పెన్షన్ల పంపిన కార్యమం జరిగింది. ముద్దనూరు జెడ్పీటిసి ఉమాదేవి, ముద్దనూరు మండల ఉపాధ్యక్షులు రేణుక, పుష్పలత, లు హాజరైన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముద్దనూరు మాజీ మండలాధ్యక్షుడు కెవి మునిరాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వృద్ధులకు ఇచ్చే పింఛన్లు మొత్తాన్ని పెంచారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ను ఎన్నడును మరువ వద్దని వివరించారు.ముద్దనూరు ఎంపిడిఓ రమణారెడ్డి పథకం పై విశదీకరించారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు మండల వైఎస్ ఆర్ సి పి కన్వీనర్ శ్రీధర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం ఎన్నాళ్లో వెతలు : ఒంటేరు

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 5, ప్రభాతవార్త

ఉపాధ్యాయులు వేతనాల కోసం ప్రతి నెల ఎదురుచూడాల్సిన దుస్థితి ఇంకా ఎన్నాళ్లు ఉందో అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవా ధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఆవేదన చెందారు. ఒకటో తేదీన ఇవ్వాల్సిన వేతనాలను ఐదో తేదీ దాటినా ఇవ్వకపోవడంవల్ల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉండే గురువులు నేడు ప్రభుత్వానికి బరువయ్యారా అని ఉపాధ్యాయులు బాధపడుతున్నారని అన్నారు. సకాలంలో వేతనాలు అందకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐ చెల్లింపులు, అనారోగ్యంతో ఉన్న వారి మెడికల్ బిల్లుల చెల్లింపు, ఇతర అత్యవసర ఖర్చులకోసం డబ్బులు లేక ఉపాధ్యాయులు, ఉద్యోగులు , పింఛను దారులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. విధులకు సకాలంలో హాజరుకాకుంటే వేతనాల్లో కోత విధిస్తామని చెపుతున్న ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వనిదానికి కూడా చెల్లించాల్సిందే అని అన్నారు. ఫిబ్రవరిలో జరుగు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితిని రూ. 2.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2014 నుంచి ఆదాయ పన్ను స్లాబులో ఎటువంటి మార్పులు చేయలేదని దీని వల్ల ఉద్యోగులు ఒక నెల వేతనాన్ని ఆదాయపు పన్ను కింద కోల్పోవాల్సి వస్తోందన్నారు.

రాజ్యాంగ విరుద్ధమైన జీవో నెం.1ని రద్దు చేయాలి : టిడిపి

ప్రొద్దుటూరు జనవరి 5, ప్రభాతవార్త

ఆంక్షలతో ప్రజలను అడ్డుకోవడం అసాధ్యమని ఇది రాజ్యాంగ విరుద్ధమని తక్షణమే జీవో నెం.1 రద్దు చేయాలని టిడిపి ఇన్చార్జి జీవి ప్రవీణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహా నికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం రాష్ట్ర వైసిపి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా తెచ్చిన జీవో నెం.1 ప్రతులను ఆయనతో పాటు తెదేపా శ్రేణులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిట్లర్, తుగ్లక్, గోబెల్స్ కు ప్రతిరూపం జగన్ రెడ్డి అని మండి పడ్డారు. పాద యాత్రలు, ఓదార్పు యాత్ర, దీక్షలను ఆనాడు టీడీపీ ప్రభుత్వం అడ్డుకొంటే జగన్ రెడ్డి పరిస్థితి ఏంటి? అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి చర్యలను ప్రజలు విసిగిపోయారని ప్రభుత్వానికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టిడిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి ముక్తియార్, టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు కుతుబుద్దీన్, తాటి శ్రీనివాస యాదవ్, నాగమునిరెడ్డి, బొర్రా రామాంజనేయులు బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సుంకర వేణుగోపాల్, బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు పొలాలను సందర్శించిన సురేంద్రరెడ్డి

పెండ్లిమర్రి, జనవరి 5, ప్రభాతవార్త:

పగడాలపల్లి గ్రామంలో గురువారం గంగిరెడ్డి వేసిన కూరగాయల పంటలను అలాగే చామంతి పంటలను రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేంద్రారెడ్డి పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామృష్ణను రాజు మాట్లాడుతూ రైతులు పురుగు మందులను విపరీతంగా వాడి నష్టపోతున్నారు. కనుక కషాయాలు వాడి ఖర్చులు తగ్గించుకోవాలని రైతులను తెలిపారు. అనంతరం చెన్నమరాజుపల్లి గ్రామంలో వేసిన సులోచన చామంతి పంటను కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు.

రేపు కృష్ణంపల్లెకు ఎమ్మెల్యే రాక

దువ్వూరు, జనవరి 5, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కృష్ణంపల్లెకు వస్తున్నట్లు జడ్పీటీసీ ఏరువ కృష్ణయ్య తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తారని కుటుంబానికి అందిన పథకాలు కూడా వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్మాణ పనులు

సిద్ధవటం జనవరి 05, ప్రభాతవార్త

మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామ రెవెన్యూ పొలంలో సర్వే నెంబర్ 592.1 నందు 20 ఎకరముల 84 సెంట్ల వంక పోరంబోకు భూమి ఉన్నది సదరు భూమి భాకరాపేట గ్రామానికి ఆనుకొని ఉన్న బాకరాపేట సిద్ధవటం ప్రధాన రహదారికి అనుకొని ఉన్నది ఇందులో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్ నిర్మాణ పనులు చేపట్టడం సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి సదరు వంక పోరంబోకు నందు వంక ఆనుకొని కమ్యూనిటీ సానిటరీ సెంటర్ కట్టడం పనులు జరుగు తున్నాయి భవిష్యత్తులో వరదలు వచ్చి ప్రభుత్వం నిర్మించే కట్టడాలు కోతకు గురై నష్టం వాటిలితే ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయినట్లు కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు ఈ విషయమై ఆర్డబ్ల్యుఎస్ ఏఈ మానసను వివరణ కోరగా కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్ కు ప్రభుత్వం నిధులు కేటాయించడం జరిగిందని అందుకనే ప్రభుత్వ స్థలంలో మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు సదరు నిర్మాణ పనులు జరుగుతున్న విషయంపై మండల తాసిల్దార్ శంకర్రావు వివరణ కోరగా ప్రభుత్వ పరంగా కమ్యూనిటీ శానిటేషన్ సెంటర్‌కు సంబంధించి ఎటువంటి స్థలం కేటాయించడం జరగలేదన్నారు అనుమతులు తీసుకోకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

కడప జనవరి 5, ప్రభాతవార్త

నగర శివారులో ఉన్న ఆశనిలయం లో నివసిస్తున్న మూగ, చెవిటి విద్యార్థు లకు అబ్దుల్ కలామ్ సేవా సమితి అధ్య క్షుడు ఆడిటర్ పఠాన్. తౌహిద్‌ఖాన్ గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తౌహిద్ ఖాన్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా తన తరపున దుప్పట్లు పంపిణీ చేయ డం జరిగిందన్నారు. ఇక్కడ నివసిస్తున్న విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వడం సంతో షంగా ఉందని, రాబోయే రోజుల్లో ఆశ నిలయానికి తన వంతు సహాయ సహ కారాలు అందజేస్తానని తెలిపారు. ఆర్.కె. హెల్పింగ్ హ్యాండ్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు విష్ణువర్ధన్ తరపున ఆశ్రమానికి అందించా రు. తమ విద్యార్థులకు దుప్పట్లు అందజేసినందుకు ఆశనిలయం నిర్వాహకు రాలు సిస్టర్ జ్యోతిష్య తౌహిద్ ఖాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొప్పర్తి సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో

రామాపురం.జనవరి 05 ప్రభాతవార్త

పదవ తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో రాఘవ రెడ్డి అన్నారు. మండలంలోని స్థానిక మం డల విద్యాశాఖ అధికారి కార్యాల యంలో బాలయోగి గురుకుల పాఠశాలలో గురు వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. నాడు నేడు పనులపై ఆయన సమీక్షించారు. మండ లంలో జరుగుతున్న నాడు నేడు పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బాలయోగి గురుకుల పాఠశాలకు వెళ్లి పదవ తరగతి విద్యార్థుల ఉపాధ్యాయు లకు సూచనలు ఇచ్చారు. రోజు విద్యా ర్థులకు లెసన్ ప్లాన్ విద్యార్థుల సామర్థ్యా లను పరీక్షించాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రామక్రిష్ణుడు ప్రిన్సిపల్ వినయ్‌కుమార్ ఎంఈవో కార్యాలయం సిబ్బం ది చంద్రశేఖర్ విశ్వనాథ్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారి ఒత్తిడే, అజమాయిషి నుండే సిఆర్పిలను తప్పించాలి

ప్రొద్దుటూరు అర్బన్, జనవరి 5, ప్రభాతవార్త

ఆదిమూలం శంకర్, రాష్ట్ర సిఆర్పి హక్కుల సాధన సమితి కన్వీనర్ ఆదిమూలం శంకర్ ప్రొద్దుటూరు మండలం మండల విద్యాశాఖ అధికారి సమగ్ర శిక్ష తరపున పాఠశాల సముదాయ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సిఆర్పిల పట్ల అజమాయిషి , మానసిక ఒత్తిడికి గురి చేస్తూ అలాగే తప్పిపోయి దొరికిన 8 ట్యాబులను ఎలా జరిగిందో సిఆర్పిలను విచారించాలని పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం ఎంతవరకు సబబు అని, జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమ గ్ర శిక్ష వారికి సిఆర్పీలు పడుతున్న ఇబ్బందులను సిఆర్పి హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆదిమూలం శంకర్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డికి వినతి పత్రం ద్వారా గురువారం సవివరంగా తెలియజేశారు. ప్రొద్దుటూరు మండలం విద్యాశాఖ అధికారి ఒక మహిళ అయి ఉండి మహిళా సిఆర్పిలను పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కించడం చాలా దారుణమని సిఆర్పిల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సిఆర్పిలు దొంగలుగా ముద్ర పడాల్సి వచ్చిందని వ్యవహరిం చారని ఆయన వాపోయారు. సమగ్ర విచారణ జరిపి తప్పు చేసిన వారిని శిక్షించి తప్పుడు కేసులు పెట్టిన వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నూతన మసీదును ప్రారంభించిన మతపెద్దలు

రామాపురం.జనవరి 05 ప్రభాతవార్త

మండలంలోని హసనాపురంలో ముస్లీంలు నూతనంగా నిర్మించిన జమి యా మసీదును గురువారం ప్రభుత్వ సర్కార్జీ ముస్లీం మత పెద్దలు ప్రారంభిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈ గ్రామంలో మసీదును పూర్వం రాళ్లతో నిర్మించారని ఆ మసీదు వర్షం వచ్చే పూర్తిగా తడిసిపోతున్నదన్నారు. గ్రామంలోని పెద్దలందరూ మసీదు నూత నంగా నిర్మాణం ఏర్పాటుకు పలువురు ఆర్థిక సాయం అందించారని వారు తెలి పారు. మసీదు 2022 ఫిబ్రవరి నెల 22వ తేదీన నిర్మాణణ చేపట్టి గురువారం ప్రారంభించడం జరిగిందని వారు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణా నికి చెందిన ప్రభుత్వ సర్కార్జీ, మతపెద్దలు, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

పేదలపాలిట పెన్నిది జగనన్న : ఎమ్మెల్యే మేడా

వీరబల్లి.జనవరి 05 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట పెన్నిదని రాజంపేట ఎమ్మె ల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలో కొత్తగా మంజూరు అయిన వితంతు, వృద్యాప్య, వికలాంగులు, దప్పు కళాకారులు, వ్యాధిగ్రస్తుల పించన్‌లు ఎమ్మెల్యే ఎంపిపి రాజేంద్రనాథరెడ్డి కలిసి పంపిణీ చేశారు. ముందుగా ఎంపిడివో కార్యాల యంలో పించన్‌ల లబ్దిదారులకు పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు పెద్ద కొడుకులా ఆదుకోవడం జరుగుతున్నదని తెలిపారు. పేద పిల్లలకు మంచి చదువులు, మంచి ఆరోగ్యం అందించడంలో ఆయనకు ఎవరూ సాటిరారన్నారు. పించన్‌లు 2500 నుంచి 2750 వరకు పెంచడం జరి గిందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు వీరనాగిరెడ్డి, కుళాయి రెడ్డి, జిల్లా పరిషత్ సభ్యులు శివరామయ్య, సర్పంచ్‌లు, ఎంపి టిసిలు, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు సంకెళ్లు

వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :

రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలు, ర్యాలీలు, రోడ్‌షోలు నియంత్రించే జీవో తక్ష ణమే ఉపసంహరించుకోవాలని ఏపీ నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్య క్షుడు గూడూరు రామచంద్ర గురువారం ఒక పత్రికా ప్రకటనలో ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పి పుచ్చుకోవ డానికి చీకటి చట్టాలను ప్రవేశపెట్టి ప్రజా ఉద్యమాలను అణచివేసే పద్ధతి సరైంది కాద న్నారు. దీనిని ఏపీ నాయీబ్రాహ్మణ సంఘం వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య హక్కులను నిషేధించడం ప్రజా స్వామ్య వ్యవస్థకే ప్రమాదం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముస్లింలకు అందుబాటులో ఉర్దూ క్యాలెండర్

కడప ఏడురోడ్లు, జనవరి 5, ప్రభాతవార్త:

జీవో నెం.1ని వెనక్కి తీసుకోవాలి

– సోషల్ మీడియా స్టేట్ ఛైర్మెన్ తులసిరెడ్డి

బద్వేలు రూరల్, జనవరి 05 ప్రభాతవార్త :66

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన జీవో నెం.1 ని వెంటనే వెనక్కి తీసుకోవాలని సోషల్ మీడియా స్టేట్ ఛైర్మెన్ తులసిరెడ్డి, ఏపిసిసి కాంగ్రెస్ కమిటీ కో ఆర్డినేషన్ మెంబర్ కమలమ్మ అన్నారు. గురువారం స్థానిక ఆర్అండ్బి బంగ్లాలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యతగా పోరాటాలు చేసే హక్కు ప్రతిఒక్కరికీ ఉందని, దానిని అణిచి వేయాలని చూడడం సరైన చర్య కాదని, ఎన్నికలు ఒక సంవత్సరంలో ఉన్న సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు ప్రజల వద్దకు వెళ్ళాలనుకుంటాయని, కానీ దానిని సహించలేని రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలకు ఒడిగట్టడం ఎంత వరకు సబబు అని, కాంగ్రెస్ పార్టీ అధి నాయకులు రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా భారత్ జోడో యాత్ర చేస్తున్నారని, ఎక్కడ ఇటువంటి ఆంక్షలు లేవని, కేవలం ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఇటువంటి ఆంక్షలు విధించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య భారత దేశంలో ప్రతి పౌరుడు, ప్రతి రాజకీయ పార్టీ స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలతో మమేకం కావాలనుకోవడం పరిపాటి అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి జీవో నెంబర్ 1ని వెనక్కి తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నపరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అచ్యుతరాజు, పట్టణ నాయకులు హిమాం సాహెబ్, అన్వర్, షమీర్, ఫైరోజ్, బాష, మహిర్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి

వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :

పేదలకు పంపిణీ చేసే గృహ నిర్మాణ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వేంపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఆర్డీవో వెంకటేష్, హౌసింగ్ డీఈ బాల గంగన్న, మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీపీ ఎన్.లక్ష్మిగాయత్రిలతో కలిసి సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ప్రభుత్వం చేపట్టే గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న గృహ నిర్మాణాలలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పూర్తి అవగాహనతో లక్ష్యాలను అధిగమించాలన్నారు. అలాగే మండలస్థాయి అధికారులు లేఔట్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సందర్శింఆలని తెలిపారు. ముఖ్యంగా వేంపల్లె 1, 3, 7, 8 పరిధిల్లో మంజూరైన గృహ లబ్దిదారులు వేగవంతంగా ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరెడ్డి, తహసీల్దారు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సుక్రమ్‌రెడ్డి, ఏపీఎం బాలస్వామి, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, హబీబుల్లా, శివశంకర్ రెడ్డి, సర్పంచులు మధుప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

వేంపల్లె, జనవరి 5, ప్రభాతవార్త :

ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, రాహుల్, జిల్లా నాయకులు వెంకట సుబ్బయ్యలు పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక మండల గౌరవాధ్యక్షుడు చక్రపాణిరెడ్డితో కలిసి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకూరు శ్రీనివాసులు, నాయకులు షామీర్, గంగాధర్‌రెడ్డిలు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ్ ముందంజలో ఉందన్నారు. ముఖ్య సమస్యలైన సీపీఎస్ పదోన్నతులు, బదిలీల రద్దు, తదితర వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో ః

పులివెందులలో గురువారం జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సరం 2023 క్యాలెండరును ఎంఈవో వీరారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్‌రాహుల్‌లు ఎంఈవో చేతుల మీదుగా క్యాలెండును విడుదల చేశారు.కార్యక్రమంలో కడప జిల్లా గౌరవాధ్యక్షులు గంగాధర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి సమీర్‌బాష, జిల్లాఉపాధ్యక్షులు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులను చితకబాదిన ఉపాధ్యాయులు

పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

బద్వేలు, జనవరి 05 ప్రభాతవార్త :

పట్టణంలోని రజకవీధిలో ఉండే ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు కొట్టారని తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టారు. పాఠశాల గదిలో పేపర్లు కనపడలేదనే నెపంతో మధ్యాహ్నం సమయంలో విద్యార్థులను దారుణంగా ఉపాధ్యాయులు కొట్టడం జరిగింది. విద్యార్థులు ఇంటికి వెళ్ళాక వారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారంతా పాఠశాల వద్ద నిరసన తెలిపారు. మా పిల్లలను ఎందుకు కొట్టవలసి వచ్చింది, ఇంత దారుణంగా కొట్టవలసిన అవసరం ఎందుకొచ్చింది? ఏ తప్పు చేశారని కొడుతారంటూ పాఠశాలపైకి వెళ్ళారు. పేపర్లు కనపడనంత మాత్రాన విద్యార్థులను కొడతారా? ఎవరు బాధ్యత వహించాలి? పిల్లలకు చదువు చెప్పాలని పాఠశాలకు పంపితే ఇలా గొడ్డును బాదినట్లు బాదుతారా? ఇదెక్కడి న్యాయం అంటూ తల్లిదండ్రులు ఆవేదనతో ఉపాధ్యాయులను నిలదీశారు.

బీజేపి మండల మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం

గాలివీడు.జనవరి 05 ప్రభాతవార్త

భారతీయ జనతాపార్టీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బాలరాజు సుభద్ర ఆధ్వర్యంలో గాలివీడు మండల మహిళా మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది.కార్యక్రమంలో నూతనంగా మండల మహిళా మోర్చా అధ్యక్షురాలుగా పట్టా రాధమ్మ, ప్రధాన కార్యదర్శులుగా తుమ్మగింజల శశికళ మరియు రమాదేవిలు, మండల మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా బండి రెడ్డెమ్మ మరియు రామసిద్దమ్మను నియమించడం జరిగిందన్నారు.కార్యక్రమానికి బీజేపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కుడుముల రామచంద్రారెడ్డి, బీజేపి మండల అధ్యక్షులు గొట్లమిట్ట శ్రీనివాసులురెడ్డి, మండల ప్రధానకార్యదర్శి దేరంగుల సురేంద్ర, కిసాన్‌మోక్ష అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయండి

పులివెందుల రూరల్, జనవరి 5, ప్రభాతవార్త :

పులివెందులలోని జగనన్న లేఔట్‌లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం జగనన్న లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, కమీషనరు నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి అనుకున్న సమయానికి పూర్తి చేయాలని తెలిపారు.పాత సంత మార్కెట్‌లో జుగుతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్దిదారులకు నూతన పింఛన్లు పంపిణీ

నందలూరు, జనవరి 5 ప్రభాతవార్త

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతిలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ నాగిరెడ్డిపల్లె నందు లబ్దిదారులకు నూతన పింఛన్‌ను ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా 116 పింఛన్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికి లబ్ది చేకూరేవిధంగా చర్యలు చేపడుతున్నారని ఆయన అన్నారు. గతంలో పింఛను విధానానికి ప్రస్తుతం పింఛను పంపిణీ చేస్తున్న విధానానికి ఎన్నో తేడాలు ఉన్నాయని మండలంలో కొద్దిమందికి మాత్రమే పింఛను ఆగిపోవడం జరిగిందని, వాటిని కూడ పరిశీలిస్తున్నామని, సచివాలయ సిబ్బంది ద్వారా వారి అర్హతలను బట్టి పింఛను అందేలా చూస్తామని ఆయన అన్నారు. నూతన పింఛన్ పొందిన వారిలో వేపగుంట సామ్రాజ్‌కి పింఛను అందజేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నాయినపల్లె అనుదీప్, మండల కోఆప్షన్ సభ్యులు కలిముల్లాఖాన్, వైఎస్ఆర్‌సిపి నాయకులు నడివీధి సుధాకర్, హిమగిరినాథ్, నవాబు తదితరులు పాల్గొన్నారు.

కలక్టరేట్ ముఖద్వారం వద్ద జాతీయ జెండా ఏర్పాటుకు చర్యలు

–కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ ముఖద్వారం వద్ద అతిపెద్ద 102 అడుగుల స్థంబంపైన జాతీయ జెండా ఏర్పాటుకు జరుగుతున్న పనులను గురువారం జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ పరిశీలించారు. 102 అడుగులు ఎత్తుల జెండా ఆవిష్కరణకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని సంబందిత అధికారులను, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. జెండా కింద ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన పనులన్నీ త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాష, కమీషనర్ రాంబాబు, తహశీల్దార్ రవిశంకర్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో బాలక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రజలకు ఉపాధిహామీ ఒక వరం

వీరబల్లి.జనవరి 05 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంత ప్రజలకు జాతీయ ఉపాధి హామీ పథకం ఒక వరంలాంటిదని వీరబల్లి మండలం మట్లి పంచాయతీ సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి అన్నారు. గురువారం మట్లి సచివాలయం నందు ఉపాధి హామీ పథకం సోసియల్ ఆడిట్‌లో భాగంగా జరిగిన సమావేశానికి సర్పంచ్ నాగార్జునాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగార్జునాచారి మాట్లాడుతూ మట్లిగ్రామానికి సంబందించి 16, 17వ విడత ఆర్థిక సంవత్సరంకు సంబందించి ఎలాంటి అవకతవకలు లేకుండా ఉపాధి పనులు జరగడం ఆనందించదగ్గ విషయమన్నారు. కూలీలకు పని తగ్గట్టువేతనం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ సిబ్బంది జాగ్రత్తలు తీసుకుని పనులులో ఎలాంటి అవినీతి అక్రమాలు లేకుండా చూడాలని సర్పంచ్ సూచించారు. కూలీలుకు అధికారులు పనులు కల్పించాలని ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు అధికారులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. మండలంలో మట్లి గ్రామాన్ని ఆదర్శవంతంగా ప్రగతిపథంలో నడిపించాలని తాను ప్రయత్నిస్తున్నట్లు నాగార్జునాచారి చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌పి అక్కులప్ప, టిఎలు సురేంద్రరెడ్డి, దామోదర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేసుబాబు, మేట్లు, కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డిని సత్కరించిన పలువురు నాయకులు

బద్వేలు అర్బన్, జనవరి 05 ప్రభాతవార్త :

నూతన సంవత్సరం పురస్కరించుకొని ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డిని గురువారం సీనియర్ న్యాయవాది పి.వి.ఎన్.ప్రసాద్, మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ చెవుల వెంకటేశ్వర్లు, యద్దారెడ్డి, పుత్తా శ్రీరాములుతో పాటు పలువురు వైసీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. 2023 సంవత్సరంలో వైసీపీ నాయకులు, ప్రజలందరూ అష్టైశ్వర్య, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఘనంగా వేడుకలు

రాజంపేట అర్బన్, జనవరి 5 ప్రభాతవార్త

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రతియేటా 3 రోజుల పాటు ఘనంగా వేడుకలు నిర్వహించే రాజంపేట పట్టణం రామ్‌నగర్ సాయిబాబా ఆలయంలో గురువారం ఆలయాన్ని పెద్దఎత్తున పూలతో అలంకరించారు. గర్భగుడిని పూలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. బక్తులు దీపాలతో శివలింగం ఆకృతిలో చూడముచ ్చటగా అలంకరింపజేశారు. పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. ఉద యం సామూహిక సత్యనారాయనవ్రతాన్ని నిర్వ హించారు. స్వామికి పుష్పాభిషేకం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్, ఆలయ కమిటి సభ్యులు టి.లక్ష్మీనారాయణ, సంజీవరావు, ఆలయ అర్చకులు అప్పజోడు విజ యాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్లు పంపిణీ

బద్వేలు అర్బన్, జనవరి 05 ప్రభాతవార్త :

మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛన్ కానుకలను లబ్ధిదారులకు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారా యణ, వైసీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు (బుజ్జి) ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్మాత్మకంగా అవ్వా తాతలకు అందించే పింఛన్‌ను 2500 నుండి 250 రూపాయలు పెంచి 2750 రూపాయలు వంతున పంపిణీ చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలలో అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అమలుచేసి ప్రజలందరి ఆదరాభిమానాలు పొందారన్నారు. నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో 14వ వార్డు ఇన్‌ఛార్జ్ సరిటాల మౌలాలి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, భోజనం వితరణ

బద్వేలు అర్బన్, జనవరి 05 ప్రభాతవార్త :

పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల ఆశ్రమంలో ఉండే అనాధ వృద్ధులకు గురువారం కీ॥శే॥ నాగిరెడ్డి భాస్కర్ రెడ్డి జ్ఞాపకార్థం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముందస్తుగా వారి భార్య 25వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మ, కుమారుడు శివారెడ్డి, సతీమణి నారాయణమ్మ, మల్లు సుధా చేతుల మీదుగా వృద్ధులకు దుప్పట్లు అందజేసి, అనంతరం వారికి రుచికరమైన భోజనం, తినుబండారాలను వారి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కౌన్సిలర్ నాగిరెడ్డి శివమ్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అనాధ వృద్ధులకు దుప్పట్లు వితరణ చేయడమే కాకుండా, వారికి భోజనం, పండ్లు అందజేయడం జరిగిందన్నారు. అనేక రకాలుగా ఆసరా కోల్పోయి ఆశ్రమాన్ని ఆశ్రయించిన అనాధ వృద్ధుల బాగోగులను గురించి వారు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు రవి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకుంటాం–టీడీపి నాయకులు నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి :

నిరాశ్రయుల ఆశ్రమంలో ఉండే అనాధ వృద్ధులకు గత కొన్ని సంవత్సరాలుగా అవసరమైన సహాయ సహకారాలను తమ కుటుంబం తరుపున అందించే విధంగా కృషి చేస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ కాంట్రాక్టర్, 25వ వార్డు ఇన్‌ఛార్జ్ నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి అన్నారు. అనంతరం వార్త విలేకరితో నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆసరా కోల్పోయిన అనాధ వృద్ధులకు గత అనేక సంవత్సరాల నుండి తమ వంతు సహాయ సహకారాలు అందజేయడం, రాబోవు రోజులలో కూడా తమ వంతు చేయూత అందిస్తామన్నారు. తమ తండ్రి జ్ఞాపకార్థం వారికి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వృద్ధులకు రాబోవు రోజులలో కూడా తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారు తెలిపారు.

– నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి, 25వ వార్డు ఇన్‌ఛార్జ్.

వైభవంగా ఖాదర్ వల్లి స్వామి ఉరుసు మహోత్సవం

విద్యుత్ దీపాలంకరణలతో ఖాదర్ వల్లి స్వామి దర్గా

బద్వేలు రూరల్, జనవరి 05 ప్రభాతవార్త :

విద్యుత్ దీపాలంకరణలతో ఖాదర్ వల్లి స్వామి దర్గా ఉరుసు మహోత్సవం వైభవంగా నిర్వహించడంతో పాటు, జెండా మెరవాణి రెండు రోజులుగా దూదేకుల వీధి ప్రజల సహకారంతో మున్సిపాలిటీ పరిధిలోని దూదేకుల వీధిలో వెలసివున్న శ్రీశ్రీశ్రీ ఖాదర్ వల్లి స్వామి దర్గా ఉరుసు మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా బుధవారం గంధ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయికృష్ణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జెండా మెరవాణి మహోత్సవం వైభవోపేతంగా దూదేకుల వీధి ప్రజల ఆధ్వర్యంలో స్వామివారికి పలు రకాల ప్రత్యేక పూలమాలలతో అలంకారం చేపట్టి విద్యుత్ కాంతులతో విచ్చేసిన భక్తులను ఆకట్టుకునే విధంగా జెండా మెరవాణి కార్యక్రమం నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారికి పలువురు భక్తులు చదివింపులు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి జెండా మెరవాణి వెంబడి నీరు వారుపోస్తూ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి చెక్కెర చదివింపులు కార్యక్రమం నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. స్వామివారి ఉరుసు మహోత్సవం కూడా కన్నుల పండువగా నిర్వహించారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 8వ వార్డు ఇన్‌ఛార్జ్ బోయలకుంట్ల ఖాజా వల్లి, వడ్డమాను హుస్సేన్, చిన్న మాబు హుస్సేన్, ఉదయగిరి మాబు, రాజుపాలెం సిద్దీక్, సుభాన్, అలీ బాష, ఖాదర్ బాష, స్టూడియో మస్తాన్, సుభాన్ బాష, ఖాదర్ వల్లి, రిటైర్డ్ ఏఎస్ఐ పీరయ్య, హుస్సేనమ్మ, దాదాపీర్, షాజహాన్, నూరాని టీ స్టాల్ మీరావల్లి, నాగూర్ వల్లి, రహీం, బాష, నాయబ్, భక్తులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది ప్రభాకర్ శాస్త్రి అజాత శత్రువు

కడప లీగల్, జనవరి 5, ప్రభాతవార్త:

సీనియర్ న్యాయయవాది జి.ప్రభాకర్‌శాస్త్రి క్లైంట్లకు, సామాన్య ప్రజలకు అజాత శత్రువు లాంటివారని ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీఎన్ మూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆవరణ లో ఉన్న మొదటి అదనపు జిల్లా కోర్టులో మృతి చెందిన సీనియర్ న్యాయవాది ప్రభాకర్‌శాస్త్రికి గురువారం ఉదయం సంతాపసభ జరిగింది. సీనియర్ న్యాయవాది ప్రభాకర్‌శాస్త్రి మృతిపై 5 నిమి షాల పాటు మౌనం పాటించారు. అనంతరం కడప కోర్టులో న్యాయవాదులుగా విధులు నిర్వ హిస్తున్న అందరూ విధులు బహిష్కరించి సంతాపం ప్రకటించారు.కార్యక్రమంలో కడప కోర్టులో ఉన్న న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రామలింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి కెనెడి, ఉపాధ్యక్షులు నాగశేఖర్, జ్యోతి, శివశంకర్‌రెడ్డి, కేపీ మల్లికార్జున, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

రైట్‌హ్యాండ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

పోరుమామిళ్ళ, జనవరి 5, ప్రభాతవార్త:

పోరుమామిళ్ల పట్టణంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్ నందు , మైదుకూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన మరియ రోజమ్మకు పాజిటివ్ రక్తం, కవలకుంట్ల గ్రామానికి చెందిన నారాయణమ్మ అను గర్భిణీకు ఏ పాజిటివ్ రక్తం అత్యవసరంగా అర్ధరాత్రి వేళ అవసరం కాగా పేషంట్ తాలూకు వారి తల్లిదండ్రులు, బందువులు రైట్ హ్యాండ్ ఆర్గనేషన్ స్థాపకులైన షేక్ నాయబ్ రసూల్ ని సంప్రదించగా రసూల్ వెంటనే స్పందించి ఆర్గనేషన్ తరుపున పోరుమామిళ్ల గ్రామానికి చెందిన షేక్ మున్వర్ చే బి పాజిటివ్ రక్తం, షేక్ మాహిర్ చే, ఏ పాజిటివ్ రక్తదానం చేపించారు. సేవా సంస్థ ఫౌండర్ రసూల్ అడిగిన వెంటనే ముందుకు వచ్చి రక్తదానం చేసిన మున్వార్ ,మాహిర్ ను రైట్ హ్యాండ్ సంస్థ డైరెక్టర్ ప్రసాద్, హాస్పిటల్ యాజమాన్యం పలువురు అభినదించారు. కార్యక్రమంలో రైట్ అండ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అఖిల్, ప్రసాద్ , చైతన్య ,పోలయ్య ,మున్న , నరసింహ,సుధాకర్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ స్టేడియం రెండు నెలలో పూర్తి చేయాలి

–నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లాలో నిర్మించే క్రికెట్ స్టేడియం స్థలాన్ని గురువారం కలెక్టర్ గిరీషా పిఎస్ పరిశీలించి క్రికెట్ స్టేడియం రెండు నెలలో పూర్తి చేయాలని సంబందిత అధికారులను ఆదేశించారు. రాయచోటి పట్టణం సమీపంలోని నక్కలవాండ్లపల్లి సమీపంలో క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో నిర్మించడం జరుగుతుందన్నారు. 2కోట్ల రూపాయల వ్యయంతో 25 ఎకరాలలో నిర్మించనున్న ఈ క్రికెట్ స్టేడియాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్టేడియం నిర్మాణ స్థలాన్ని జేసిబితో చదును చేయించి స్టేడయం చుట్టు ఫినిషింగ్ వాల్, ఫ్లడ్ లైట్స్, రోడ్లు వంటి వాటిని త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యమ్రకంలో మున్సిపల్ కమీషనర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన ఫయాజ్‌బాష, తహశీల్దార్ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి మున్సిపాలిటీలో అభివృద్ధి ఎక్కడ?

–మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి.జనవరి 05 ప్రభాతవార్త

రాయచోటి మున్సిపాలిటీని ప్రభుత్వం గ్రేడ్–1 మున్సిపాలిటీగా మార్పు చేసినా ఈ మూడన్నర సంవత్సరంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం రాయచోటి పట్టణం 8వ వార్డు పరిధిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులతో రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజ్, రోడ్లు, కుళ్లిన చెత్త, మురుగు నీరు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్–1గా మార్చి ప్రజల నుంచి ఇంటి పన్ను నీటి పన్ను, చెత్త పన్నులను పెంచి ప్రజల నడ్డి విరిచారని ఆయన ఆ